



పార్కును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ముస్సిపల్ కాంట్రాక్టర్ కబ్జాలో పార్కు స్థలం

- డంపు యార్డుగా రూ .10 కోట్ల విలువైన పార్కు స్థలం
- సుందరయ్య పార్కు అభివృద్ధిపై స్పందించని అధికారులు , ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

దేశంలో మొదటి ప్రతిపక్ష నాయకులు పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లిన త్యాగశీలి సుందరయ్య పేరుతో నిర్మించిన పార్కు శిథిలమైంది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ సమీపంలోని సోమిసెట్టి నగర్‌లో ఉన్న ఈ పార్కు అభివృద్ధి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల బలహీనతను గుర్తించి ఒక ముస్సిపల్ కాంట్రాక్టర్ రూ.10కోట్ల విలువైన పార్కు స్థలాన్ని తన కబ్జాలో ఉంచుకొని పనికిరాని మట్టి కంకర ఇసుక అందులో నిల్వ ఉంచుతూ మొత్తం పార్కును డంప్ యార్డుగా మార్చాడు. రోడ్లపై రోడ్లు వేస్తూ అవసరంలేని అభివృద్ధి పనులు చేస్తూ రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నా ముస్సిపల్ అధికారులు స్వాతంత్ర సమరయోధుడు సుందరయ్య పార్కు అభివృద్ధి చేయాలనే ఆలోచన లేకపోవడం బాధాకరమని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు. వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఆ కాలనీలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం బుధవారం పర్యటించింది. దాదాపు 1000 కుటుంబాలు నివసించే వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలో ఉన్న ఏకైక పెద్ద పార్కు అభివృద్ధి పట్ల అధికార వైసిపి ప్రజా ప్రతినిధులు, స్పందించకపోవడం ప్రతిపక్ష పార్టీ కార్పొరేటర్లు పట్టించుకోకపోవడం విచిత్రంగా ఉందని విమర్శించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కెఎస్.పద్మ, సుందరయ్యపార్కు అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.చంద్రయ్య, టి నరసింహ మాట్లాడుతూ సుందరయ్య పార్కు అభివృద్ధి చేయనందువల్ల అసాంఘిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందన్నారు. పార్కును డంప్ యార్డ్‌గా ఉపయోగించుకుం టున్న ముస్సిపల్ కాంట్రాక్టర్ ను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఫోన్ ద్వారా మందలించారని తెలిపారు. వెంటనే కమిషనర్ స్పందించి పార్కును స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పిపిఎస్ఎస్ నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, పి.ఇక్బాల్, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.రాజు, విజయలక్ష్మి, శివాని, వై.రామిరెడ్డి, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, నవీన్, పీటర్ పాల్గొన్నారు.

బిఎల్‌ఓలు, సెక్టోరల్ ఆఫీసర్లకు శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు ఎస్‌బిఐ కాలనీలోని నగరపాలక సంస్థ కొత్త కౌన్సిల్ హాలులో, బుధవారం 137-కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ బిఎల్‌ఓలు, సెక్టోరల్ ఆఫీసర్లకు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ , పోల్ డే కార్యకలాపాలు, పోలింగ్ ఏర్పాట్లు , ఇతర సంబంధిత అంశాల పై సమగ్ర శిక్షణ ఇచ్చారు. 137-కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ ఈ శిక్షణ నిర్వహించారు. అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, సూపెరిండెంటెంట్ సుబ్బన్న , టౌన్ ప్లానింగ్ సిబ్బంది అనంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని హామీలు

- పరిష్కారం కాని సమస్యలు - జగన్‌పైనే జిల్లా వాసుల ఆశలు
- నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేరలేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఆయనపైనే జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు...

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు వద్ద జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బనగానపల్లెలో ఈబీసీ నేస్తం పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేర లేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఆయనపైనే జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు.

గుండ్రేవుల ఏది..?

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మిస్తానని 2017 నవంబరు 27న జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో టిడిపి ఓడిపోయింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

నీటిని మరిచారు

దశాబ్దాలుగా కోడుమూరు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైసిపి అధికారం చేపట్టిన నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్‌లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నిర్మిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు. ఎల్ఎల్‌సిని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు. ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు. కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.

ఆగని వలసలు

వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలో వలసలు ఆగడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జిల్లా నుంచి 2 లక్షల మంది వలస వెళ్తున్నారు.

హైకోర్టుకు పడని అడుగులు

కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటిస్తూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడుస్తున్నా హైకోర్టు ఏర్పాటుకు అడుగులు పడడం లేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు వద్ద హైకోర్టు కోసం 200 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అక్కడితో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రతిపక్షాలు హైకోర్టు ఏర్పాటుకు అడ్డుపడుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏది..?

జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ భూమిపూజకే పరిమితమైంది. ప్రాసెసింగ్ యూనిట్ వస్తే కాస్త ధర దక్కుతుందన్న రైతన్నకు నిరాశే ఎదురవుతోంది. చిత్తూరు జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమోటాను అత్యధికంగా క్రయవిక్రయాలు సాగుతాయి. పత్తికొండ నుంచి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. టమోటా ఎక్కువగా సాగు ఉండడంతో ఆ ప్రాంతంలో టమోటా జ్యూస్, సాస్ తయారు చేసేలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్.జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మూడేళ్లు దాన్ని పట్టించుకోలేదు. జూన్ 1న ముఖ్యమంత్రి పత్తికొండలో పర్యటించిన సందర్భంగా పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని మళ్లీ ప్రకటించారు. సెప్టెంబర్‌లో పత్తికొండ శివార్లలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రాంతంలో అధికారులు భూమిపూజ కూడా చేశారు. యూనిట్ నెలకొల్పేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అక్కడి నుంచి ముందుకు కదలలేదు.

ఓటర్ జాబితా దరఖాస్తులు పరిశీలన పూర్తి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితాకు సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి పూర్తి చేయాలని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 860 ఫార్మ్స్ డిస్పోస్ చేశామని, మరల కొత్తగా నిన్న 1000 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఏడు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు 2300 ఉన్నాయన్నారు. అందులో కర్నూలులో 727, ఆదోనిలో 445, పాణ్యం 150, కొడుమూరు 150, ఎమ్మిగనూరు 127, ఆలూరు149 ఉన్నాయని, వీటిని జాప్యం లేకుండా డిస్పోస్ చేయాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం అందచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. పత్తికొండ డివిజన్లో 49 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, ఆదోని డివిజన్లో 70 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నారని, వారు కోరిన మండలాల్లో స్థలాలను గుర్తించి బేసిక్ ప్రైస్ వివరాలను రూపొందించిన నివేదికలు ఈరోజు సమర్పిస్తామని సంబంధిత డివిజనల్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కర్నూలు నగర సమీపంలోని జగన్నాథ గట్టుపై గురువారం జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా సిఎం పర్యటన ఏర్పాట్లను హెలిపాడ్, సభాస్థలి వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన , డిఐజి సిహెచ్.విజయరావు ,ఎస్పి కృష్ణ కాంత్ పరిశీలించారు. .హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రిని కలవడానికి వచ్చే ప్రముఖులను ఒక పద్ధతి ప్రకారం తీసుకొని పోయే ఏర్పాటు ఉండాలని సూచించారు. రోప్ పార్టీ చాలా చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం భూమి పూజ కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ , డిఐజి , ఎస్పి అధికారులను కోరారు. ఈ పర్యటనలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయరాం రెడ్డి , సిఎం సెక్యూరిటీ అధికారి విశ్వనాథం , డిఎస్పి విజయ్ శేఖర్, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, కల్లూరు తహశీల్దార్ మునివేలు , విద్యుత్ శాఖ డిఇ సుబ్బన్న , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సిబ్బంది సమకూర్చే దిశగా చర్యలు : కలెక్టర్



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, డిఐజి, ఎస్పి

ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బందిని సమకూర్చే దిశగా చర్యలు తీసుకోవాలని పోలింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ పై సంబంధిత నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు విధులు నిర్వహించేందుకు జిల్లాలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు. ? పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఉన్న పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఎవ్వరూ సమకూర్చాలనే దానిపై కూడా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక వేసుకోవాలన్నారు. కాంట్రాక్ట్, అంగన్వాడీ సిబ్బంది వివరాలు సేకరించి ఉన్నపటికీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలు కూడా సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఖజానా శాఖ డిడి రామచంద్ర రావు, ఉపాధి కల్పన అధికారి దీప్తి, ఎన్ఐసి అధికారి ప్రవీణ్ కుమార్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై ప్రచారం

జిల్లాలో పోలింగ్ కేంద్రాల మార్పుపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్ట్రోల్ అధికారి మాట్లాడుతూ... 43 పోలింగ్ స్టేషన్ల లొకేషన్ మార్పు , 107 పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు చేశామని తెలిపారు. ఈ విషయం పై రిటర్నింగ్ అధికారులు , రాజకీయ పార్టీ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. 18 ఆక్సిలరీ (సహాయక) పోలింగ్ స్టేషనులకు అనుమతి వచ్చిందని , ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల హేతుబద్ధీకరణ (రాండమైజేషన్) దానికి సంబంధించిన శిక్షణ, ఎంసిసి సిబ్బందికి , సాంకేతిక బృందాలకు కూడా శిక్షణ ఇచ్చామన్నారు. సింగిల్ విండో ద్వారా అభ్యర్థులకు , పార్టీలకు అనుమతులు ఇస్తామని తెలిపారు. ఫిర్యాదుల సెల్ ,మీడియా మానిటరింగ్ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ

సంస్కృత రామాయణాన్ని తెలుగీకరించిన తొలి తెలుగు కవయిత్రి అతుకూరి మొల్లమాంబ రాసిన 'మొల్ల రామాయణం' అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన పేర్కొన్నారు. బుధవారం తొలి తెలుగు కవయిత్రి అతుకూరి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి జిల్లా కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జిడి. కల్పన, డిఆర్‌ఓ మధుసూదనరావు, బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ, కుమ్మరి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




బికాం అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న బివై.రామయ్య

సచివాలయ ఉద్యోగుల నియామకాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మేయర్ , కమిషనర్ చేతుల మీదుగా, బుధవారం సచివాలయ ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఏడుగురు బికాం అభ్యర్థులు అందుకున్నారు. హై కోర్ట్ ఆదేశాలమేరకు, రాష్ట్ర ప్రభుత్వం జిఒ41 ఎంఎయుడి 2024 మార్చి 7 ఉత్తర్వులను అనుసరించి, సచివాలయ ఉద్యోగాలకు క్వాలిఫై అయిన ఏడుగురు బికాం అభ్యర్థులకు, ఆర్‌డి ఎంఎ నియామక ఆదేశాలను జారీ చేశారు. ఈ ఏడుగురు అభ్యర్థులు తమ నియామక ఉత్తర్వులను కర్నూలు నగర మేయర్ బి వై రామయ్య , మునిసిపల్ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఒఎల్ ఆర్.వెంకటలక్ష్మి యుపిఎ సూపెరిండెంటెంట్ మంజూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



గీతాంజలి ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

జనసేన, టిడిపి ఐటిడిపి, జనసేన, టిడిపి నాయకులు ఐటిడిపి సైన్యంతో సోషల్ మీడియాలో నీచంగా ట్రోల్ చేయించి గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలని వైసిపి నాయకులు ఎంపిపి నారాయణదాసును బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం పత్తికొండ వైసిపి కార్యాలయం నుండి నాలుగు స్థంభాల కూడలి వరకు వైసిపి నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ కారం నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, అందులో భాగంగా సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన గీతాంజలి తనకు మంచి జరిగిందని చెప్పుకున్న గీతాంజలిని రెండు రోజుల నుండి జనసేన,టిడిపి చెందిన సైన్యం అసభ్యకరంగా ట్రోలింగ్ చేయడంతో మనస్థాపానికి గురైన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. రెండు రోజుల నుండి మృత్యువుతో పోరాడి చివరికి మరణించిందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు భాస్కర్‌నాయక్, బనగాని శ్రీనివాసులు, కానిపాకం ట్రస్ట్ మెంబర్ అరుణ, పెద్దహుల్తి సర్పంచి విజయలక్ష్మి, నాగరాజు, దూదే కొండ సర్పంచి రహిమాన్, చిన్న హుల్తి సర్పంచి కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు అభివృద్ధి పనులు ప్రారంభించండి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్



మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు జిల్లాలో అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని, కనీసం టెండర్లు నిర్వహించి పని ప్రదేశంలో మెటీరియల్‌ను నిలిపి పనులను మొదలు పెట్టాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి తెలిపారు. బుధవారం మినీ మీటింగ్ హాలులో జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. వైస్ ఛైర్మన్ దిల్షాద్ ముజఫర్ నాయక్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లాలోని జడ్‌పిటిసిలు తమ ప్రాంతంలోని సమస్యలపై అధికారులను అడిగి, వాటిని పరిష్కారం చేసేలా చర్చించారు. శిరువెళ్ల జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం లేదని, పునరుద్ధరించాలని వైస్ ఛైర్మన్ దిల్షాద్ తెలిపారు. వెల్దుర్తి జడ్‌పిటిసి సుంకన్న మాట్లాడుతూ... కరువు మండలంగా ప్రకటించారని, నేటికీ నష్టపరిహారం అందలేదని తెలిపారు. అలాగే మిరప రైతులకు తీవ్ర నష్టాలు వచ్చాయని, వాటి నష్టపరిహారం కూడా అందలేదని చెప్పారు. హార్టికల్చర్ ఎడి రామాంజనేయులు మాట్లాడుతూ... నష్టాన్ని అంచనా వేశామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు పరిహారం నిర్దేశిస్తారని తెలిపారు. గార్గేయపురం, మిడ్తూర్ రోడ్డు ఇప్పటికైనా బాగు చేయాలని మిడ్తూర్ జడ్‌పిటిసి యుగంధర్ రెడ్డి తెలిపారు. ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆర్అండ్‌బి ఇఇ తెలిపారు. ఆత్మకూరు జడ్‌పిటిసి శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ... పంట కాలువలకు నీరందించాలని, పంటలు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. మహానంది జడ్‌పిటిసి మహేశ్వరెడ్డి మాట్లాడుతూ... తమలపల్లి రోడ్డు గురించి పలుమార్లు చెప్పినా పూర్తి చేయలేదని తెలిపారు. సిఇఒ నాసర రెడ్డి మాట్లాడుతూ... వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రస్తుత నీటి పథకాల కాంట్రాక్టును మరో మూడు నెలలపాటు కొనసాగించుకునేలా కమిటీ తీర్మానం చేస్తే కలెక్టర్ అంగీకారంతో అనుమతి పొందవచ్చని తెలిపారు. రోడ్లు, భవనాలు, అభివృద్ధి పనులు ప్రారంభం కాకుంటే త్వరగా ప్రారంభించాలని చెప్పారు. స్టాండింగ్ కమిటీ కోఆప్షన్ సభ్యులు దివ్య, ఉమ్మడి ఛైర్మన్ సిసి అశ్విని కుమార్, ఎఒ జితేంద్ర పాల్గొన్నారు.



సత్యనారాయణమ్మ ఇంటి వద్ద సందడి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం నూతన మేయర్‌గా సిద్రా సత్యనారాయణమ్మను వైసిపి మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి ఆమె ఇంటి వద్ద కార్యకర్తలు నాయకులు అభిమానుల కోలాహలం కనిపించింది. ప్రస్తుత మేయర్ బివై రామయ్యకు కర్నూలు ఎంపీ అభ్యర్థిగా ధ్రువీకరిస్తూ పార్టీ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆ స్థానంలో ఆమెను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆమె ఇంటి వద్దకు పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో ముందుగానే ఎంపిక ప్రక్రియను కూడా పూర్తిచేసే పనుల్లో అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. మేయర్ అభ్యర్థిగా పార్టీ తనను గుర్తించినందుకు ఆమె ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు.

ఉత్సాహంగా జివి మాల్ ప్రారంభం



జివి మాల్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న సినీనటి సంయుక్త మీనన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వస్త్ర ప్రపంచంలో 75 సంవత్సరా అనుభవంతో ఖమ్మం ,గుడివాడ, రాజమండ్రి, మిర్యాలగూడ, కొత్తగూడెం, ఏలూరు సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, బీదర్, కోదాడ, నంద్యాల, తాడేపల్లిగూడెం, అమలాపురం, పిడుగురాళ్లలో కస్టమర్ల విశేషాభిమానం పొంది ఇప్పుడు కర్నూలులో 16వ నూతన షోరూంను ప్రముఖ సినీ తార కుమారి సంయుక్త మీనన్, కర్నూలు మేయర్ బివై రామయ్య, జివి మాల్ యాజమాని జి.ఉమామహేశ్వరరావు, కర్నూలు డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, 12వ వార్డ్ కార్పొరేటర్ అన్నేపోగు క్రాంతికుమార్ ప్రారంభించారు. సినీ నటి సంయుక్త మీనన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంయుక్త మీనన్ మాట్లాడుతూ మాల్ ప్రారంభోత్సవానికి కర్నూలు రావడం చాలా సంతోషంగా ఉందని, జీవి మాల్ వారు మంచి నాణ్యమైన వస్త్రాలను అమ్ముతున్నారన్నారు. మేయర్ బి.వై రామయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడటం వల్ల ఈమధ్య కాలంలో చాలా బ్రాండెడ్ మాల్స్ నగరానికి వచ్చాయని తెలిపారు. మంచి నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అనుగుణమైన ధరలో అందించాలని కోరుతూ మాల్ అభివృద్ధిలో కార్పొరేషన్ నుంచి మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. జివి.మాల్ యాజమాని జి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ 16వ బ్రాంచ్ కర్నూలులో ఏర్పాటు చేయడం చాలా సంతోషం కలిగిస్తుందన్నారు. ఇప్పటికే తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,కర్ణాటక రాష్ట్రాల్లో తమ బ్రాంచ్‌లు మంచి ప్రజాధారణ పొందాయన్నారు. మాల్ ఏర్పాటు వల్ల కర్నూలులో సుమారు 250 మందికి ఉపాధి లభించిందని చెప్పారు. మంచి నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అనువైన ధరలతో అందించడమే .జివి మాల్ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రంజాన్ మహా పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ప్రత్యేకమైన వస్త్ర కలెక్షన్లు తక్కువ ధరకే అందిస్తామన్నారు. కర్నూలు ప్రజలందరూ ప్రారంభోత్సవ ఆఫర్లను పొందాలని కోరారు.

జివిమాల్‌లో సంయుక్త మీనన్ సందడి





కంపు కొడుతున్న పట్టించుకోరా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ సమీపంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కెఇ. కృష్ణమూర్తి ఇంటికి పోయే దారిలో మసీదు ప్రక్కన యూనియన్ బ్యాంక్ ఎటిఎం ఎదురుగా రోడ్డుపై చెత్తకుప్ప పేరుకుపోయి కంపు కొడుతున్నా తొలగించే నాధుడు లేడని ఆ ప్రాంతవాసులు వాపోయారు. ఈ విషయం ప్రజాశక్తి దృష్టికి రాగా వెంటనే సంబంధిత ఫోటోను ప్రజారోగ్య అధికారికి చూపించిన వెంటనే సానిటరీ ఇన్‌స్పెక్టరును పిలిపించి వెంటనే తొలగించి, అక్కడి ఆసుపత్రి వారికి నోటీసులు జారీ చేయాలని హెచ్చరిక చేశారు.

నియమావళిపై అవగాహన అవసరం

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల నియమావళిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల విధానాలు, నియమావళిపై కేవలం రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కాకుండా రాజకీయ పార్టీలకు, మీడియా ప్రతినిధులకు కూడా స్పష్టత ఉండాలని ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీ, ఎన్నికల నోటిఫికేషన్ తేదీ వేర్వేరుగా ఉంటుందన్నారు. నోటిఫికేషన్ తేదీ నుంచి నామినేషన్లు వేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఓటర్లను మత పరంగా కానీ, కులాల పరంగా ఓట్లు అడిగినా, ఇతర అభ్యర్థుల ప్రచారానికి భంగం కలిగించినా ఎంసిసి నియమాలను ఉల్లంఘించినట్లు అవుతుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వినీత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గాను 26 మంది సెక్టోరల్ అధికారులు, ఇద్దరు రిజర్వ్ కలిపి 28 మంది సెక్టోరల్ అధికారులను నియమించామని తెలిపారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌లపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తెచ్చి, వసతుల కల్పన పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల ఎప్పుడు వచ్చినా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆదోని తహశీల్దార్, ఎఇఆర్ఒ హసీనా సుల్తానా, డిఎల్‌పిఒ కార్యాలయ పరిపాలన అధికారి, ఎఇఆర్ఒ వీరభద్రప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- 20 కోట్లతో మల్టీ విలేజ్ స్కీం నీటి పథకానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఎర్రకోట, బుట్టా రేణుక

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మల్టీ విలేజ్ స్కీం ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. బుధవారం మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద 15 గ్రామాలకు తాగునీరందించే లక్ష్యంతో రూ.19.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న మల్టీ విలేజ్ స్కీమ్ పథకానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడారు. జల జీవన్ మిషన్ నిధులతో హెచ్.కైరవాడి, కులుమాల, పుట్టపాశం, వెముగోడు, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల, ఎర్రబాడు, గాజులదిన్నె గ్రామాలతో పాటు ఎమ్మిగనూరు మండలంలోని మూడు గ్రామాలకు తాగునీరందించేందుకు గాజులదిన్నె ప్రాజెక్టులో ఇంటెక్ వెల్‌ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి నీటిని పంపించి ఫిల్టర్ అయిన తాగునీటిని ఎత్తిపోతల పథకం ద్వారా ఆయా గ్రామాలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఎంపిపి నసురుద్దీన్, బుట్టా నీలకంఠ, బసిరెడ్డి, గాజులదిన్నె సర్పంచి వెంకటేశ్వర రెడ్డి, ఎంపిడిఒ సోనీ బాయి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సాంబయ్య, ఎఇ శ్రీనివాసరెడ్డి, వైసిపి యూత్ నాయకులు టికె.బందేనవాజ్, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్సీ మధుసూదన్

ప్రజాశక్తి - ఆదోని


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్

రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తూ.. వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆదోని మున్సిపల్ మైదానంలో మెప్మా అధికారి సెమీనా బేగం అధ్యక్షతన వైఎస్ఆర్ చేయూత చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం 4వ విడత వైఎస్ఆర్ చేయూత కింద ఆర్థిక సహాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. పట్టణంలోని 45 ఏళ్లు పైబడిన 9,724 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత ద్వారా రూ.18,23,25,000 వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మజార్ అహ్మద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సురేష్, లక్ష్మీదేవి, మెప్మా సిఒలు వీరారెడ్డి, జావిద్, వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు వేణుగోపాల్, రవికుమార్, చంద్ర, నాగరాజు, శివ, కౌన్సిలర్లు లోకేశ్వరి, నాగరత్న ఉన్నారు.

వైభవంగా దేవర మహోత్సవాలు

నందవరం : నందవరంలో వెలసిన శ్రీబంగారమ్మ, శ్రీమారెమ్మ అమ్మవార్ల దేవర మహోత్సవం ఘనంగా సాగింది. గ్రామ పెద్దల సమక్షంలో మంగళవారం సాయంత్రం కుష్మాండ బలి నిర్వహించి, బుధవారం ప్రతి ఇంటి నుంచి కుంభాలు ఏర్పాటు చేసుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉదయం నుంచి కుంభ పూజ ఏర్పాటు చేయడంతో గ్రామం మొత్తం భక్తులతో కిక్కిరిసింది. దేవర సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. రెండు రోజుల్లో దాదాపు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులకు తాగునీటి ఇబ్బంది రాకుండా వైసిపి, టిడిపి నాయకులు తాగునీటి కోసం ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఎస్ఐ పి.తిమ్మయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోడల్ స్కూళ్లు గ్రామీణ విద్యార్థులకు వరం

- ప్రధానోపాధ్యాయులు శాంతిరాజు

ఎమ్మిగనూరు : మోడల్ స్కూళ్లు గ్రామీణ విద్యార్థులకు వరమని మండలంలోని మాసుమాన్ దొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు, సోషల్ ఉపాధ్యాయులు నాగరాజు, హిందీ ఉపాధ్యాయులు ప్రవీణ గాంధీ తెలిపారు. బుధవారం పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉన్నత విద్య అర్హత, అనుభవం, అంకితభావం కలిగిన ఉపాధ్యాయుల చేత కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలకు హాస్టల్ వసతి ఉంటుందని చెప్పారు. అధునాతన ల్యాబ్ సౌకర్యం, 9వ తరగతి నుంచి వృత్తి విద్యా కోర్సులు ఉంటాయని తెలిపారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు మునిస్వామి, అపర్ణలత పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న వైస్ ఛైర్మన్ నరసింహులు

ప్రతి కుటుంబానికీ లబ్ధి

- వైస్ ఛైర్మన్ నరసింహులు

ప్రజాశక్తి - ఆదోని

నవరత్న పథకాలతో ప్రతి కుటుంబమూ లబ్ధి పొందిందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు తెలిపారు. బుధవారం ఆదోనిలోని 8వ వార్డులో పర్యటించి వైసిపి ప్రభుత్వ పాలనలో కుటుంబాలు లబ్ధి పొందడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళారి వ్యవస్థ ఉండకూడదని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు వేస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వృద్ధులకు జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా సాయి ప్రసాద్ రెడ్డిని మరోసారి ఆశీర్వదిస్తే మరిన్ని పథకాలు, అభివృద్ధి చేస్తారన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా గోనెగండ్ల మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ఎస్పీ, ఎమ్మిగనూరు డీఎస్పీ ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య తెలిపారు. అందులో భాగంగా గోనెగండ్లకు రెండు కంపెనీల శశస్త్ర సీమాబల్‌కు చెందిన కేంద్ర సాయుధ బలగాలు బుధవారం చేరుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా, ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా శశస్త్ర సీమాబల్ అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు స్థానిక పోలీసులతో మండల హెడ్ క్వార్టర్‌తో పాటు మండలంలోని కున్నూరు గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

గోనెగండ్లలో చలివేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో టిడిపి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బీవీ.జయ నాగేశ్వరరెడ్డి హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో గోనెగండ్లకు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు దాహంతో ఇబ్బందులు పడకుండా టిడిపి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, బాటసారులు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఈ చలివేంద్రాన్ని ఉపయోగించుకొని దాహార్తిని తీర్చుకొని ఎండదెబ్బకు గురికాకుండా ఉండాలని సూచించారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళ బడేసాహెబ్, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, గౌవుండా రహమతుల్లా, రంగస్వామి నాయుడు, పూజారి చంద్ర, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, పిల్లిగుండ్ల జయపాల్, లింగందిన్నె నాయుడు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

విద్యుత్ సమస్య ఉండదు

- విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం
- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య ఉండదని వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సూగూరు గ్రామ సమీపంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.5 కోట్లతో 33/11 కెవి నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటుతో మండలంలోని సూగూరు, బూదూరు, వగరూరు, వి.తిమ్మాపురం, రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామాలకు విద్యుత్‌ను అనుసంధానం చేయడం వల్ల మంత్రాలయంలో ఉన్న సబ్ స్టేషన్‌పై భారం తగ్గుతుందని ఆపరేషన్ ఎడి విశ్వశాంతిస్వరూప్, ఎఇ గోవిందు తెలిపారు. ఎమ్మిగనూరు ఆపరేషన్ డిఇ ఓబులేసు, కర్నూలు నిర్మాణపు డిఇ రాజేష్, ఎడి ఎల్లప్ప, ఎస్ఐ గోపినాథ్, పోలీసు సిబ్బంది శరణబసప్ప, దశరథ రాముడు, రాఘవేంద్ర, హోంగార్డు నాగేశ్వర్ రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, హనుమంతు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా 17వ వార్డులో 2వ రోజు మైనారిటీ కాలనీలో పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రంజాన్ నెల మొదలవుతుందంటే మొదట చంద్రుడు కనబడతాడని, వైసిపి నాయకులు కనబడితే ఎన్నికలు వచ్చినట్లు అని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనుమరుగై పోతారని విమర్శించారు. ప్రజలకు వివరించి సుపరిపాలన అందించే టిడిపి, జనసేన పార్టీల కూటమిని గెలిపించాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

పాలనలో జగన్ విఫలం

- టిడిపిని గెలిపించండి
- టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని, రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని టిడిపి నాయకులు డాక్టర్ మాచాని సోమనాథ్ కోరారు. బుధవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్, గాంధీనగర్ ప్రాంతాల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో శివ టీ స్టాల్ దగ్గర టీ తాగుతూ.. ప్రజలతో సరదాగా ముచ్చటించారు. అనంతరం ఉషా స్టార్ టిఫిన్ సెంటర్‌లో.. ఓటు అభ్యర్థిస్తుండగా ప్రజలు టిఫిన్ చేయాలని కోరడంతో.. అంగీకరించి ప్రజల మధ్యనే టిఫిన్ చేశారు. పద్మశ్రీ మాచాని సోమప్ప కుటుంబం నుంచి వారసుడిగా రాజకీయాల్లోకి రావడం శుభ పరిణామమని డాక్టర్ మాచాని సోమనాథ్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని తెలిపారు. టిడిపి నాయకులు బనవాసి ఆదినారాయణ రెడ్డి, కదిరికోట ఆదెన్న, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇప్పే నరసప్ప, టిడిపి మైనార్టీ నాయకులు కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, చేనేత విభాగం నాయకులు కామర్తి గంగాధర్, ధనా, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని, కంపాడు చిన్న రంగన్న, వన్నెల మోష, ఆఫ్ఘాన్ వలీ బాష, 6వ వార్డు శంకర్, అగ్రహారం గోవిందు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మాచాని సోమనాథ్


ఇఫ్తార్ విందులో శ్రీనివాస్ ఆచారి

మతసామరస్యాన్ని కాపాడదాం

- టిడిపి నాయకులు శ్రీనివాస్ ఆచారి

ఆదోని : మతాలకతీతంగా సోదరభావం కలిగి మత సామరస్యాన్ని కాపాడాలని టిడిపి నాయకులు శ్రీనివాస్ ఆచారి తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష తీసుకున్న ముస్లింలకు, 19వ వార్డు మండగిరి షాకీరా దర్గాలో బుధవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. లౌకిక భారతదేశంలో ఎవరి మనోభావా లూ దెబ్బ తీయకుండా మెలిగాలని కోరారు. డిష్ ఈరన్న, డిష్ రవి, నరేంద్ర, మల్లప్ప, రాందాస్ పాల్గొన్నారు.

14న ధర్నాను జయప్రదం చేయండి

- రైతు సంఘం నాయకులు

దేవనకొండ : కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 14న ఢిల్లీలో జరిగే మహా ప్రదర్శనకు సంఘీభావంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 14న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు. బుధవారం ఉమ్మడి రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎపి రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు వై.కండప్ప, వ్యకాస జిల్లా నాయకులు యూసుఫ్, ఎఐటియుసి మండల నాయకులు వీరస్వామి, ఉమ్మడి కార్మిక సంఘాల నాయకులు మహాదేవ, హనుమప్ప, బాష, రామాంజి, రంగస్వామి, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

కౌతాళం : శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు రెండో రోజూ బుధవారం సాగింది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ హెచ్‌డి.వెంకటేష్ మాట్లాడారు. స్వామివారికి రూ.58,64,029 నగదును భక్తులు సమర్పించుకున్నారన్నారు. విదేశీ కరెన్సీ నోట్లు 13 రాగా, బంగారం 36 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 27 కిలోల 740 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. పాలకమండలి ఛైర్మన్ ఆర్.నాగరాజ్ గౌడ్, హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే ధ్యేయం

- ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని నాలుగోసారి గెలిపించాలి
- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వైఎస్ఆర్ ఆసరా, చేయూత, స్త్రీ నిధి పథకం నిధుల పంపిణీ చేపట్టారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు స్థానిక జిపిఎస్ రెసిడెన్సీ వద్ద నుంచి సీతారామిరెడ్డి కాన్వాయ్‌పై పూల వర్షం కురిపిస్తూ సభా ప్రాంగణం వరకు ఊరేగింపు చేపట్టారు. సభకు చేరుకున్న ఆయనకు ఎంపిడిఒ మునెప్ప, వైకెపి ఎపిఎం జయశ్రీ ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. రాఘవేంద్ర స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తమ సోదరుడు వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్ని పార్టీలు ఏకమైనా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మెగా చెక్కులను అందజేశారు. పక్కనే డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సందర్శించి అభినందనలు తెలిపారు. అనంతరం రాయలసీమ ముద్దు బిడ్డ మన జగనన్న సాంగ్‌కు డ్వాక్రా మహిళలు డ్యాన్స్ వేశారు. విశ్రాంత తహశీల్దార్ వర్మ, సిఐ ఎరిషావలీ, ఎస్ఐ గోపినాథ్, మండల నాయకులు రోగప్ప, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, చెట్నేహళ్లి సర్పంచి అంజిని, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, రామాంజనేయులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న సీతారామిరెడ్డి

చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి

- టిడిపి కౌన్సిలర్ దయాసాగర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని 21వ వార్డు టిడిపి కౌన్సిలర్, 11వ యూనిట్ క్లస్టర్ ఇన్‌ఛార్జీ విజిఎ.దయాసాగర్ తెలిపారు. బుధవారం స్థానిక 21వ వార్డులో 11వ యూనిట్ క్లస్టర్ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అండగా ఉంటూ వారి అభివృద్ధికి టిడిపి కృషి చేస్తోందని తెలిపారు. చంద్రబాబు నాయుడు బీసీ, చేతివృత్తులకు పెద్దపీట వేసి సమాజంలో గౌరవాన్ని నిలబెట్టారని చెప్పారు. బీసీ నిరుద్యోగులకు బ్యాంకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించారని తెలిపారు. బీసీ డిక్లరేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా బీవీని గెలిపించాలని కోరారు. టిడిపి నాయకులు హుసేన్ పీర్, బిజ్జె నాగరాజ్, వడ్డే కృష్ణ, మహబూబ్ బాష, బోయ రవి, పందికోన ఈరన్న, ఉరుకుంద, పెద్ద రంగన్న, రమేష్, చేనేత మల్లికార్జున, అబ్దుల్లా, యుకె.రాజశేఖర్, యు.శేఖర్, శేషునాయుడు పాల్గొన్నారు.


చంద్రబాబుకు పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేక నిఘా : సిఐ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఆదోని తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మండల ప్రజలతో స్నేహభావంగా మెలిగి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ కృష్ణ కాంత్, ఆదోని డీఎస్పీ శివ నారాయణస్వామి ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సమన్వయం చేసుకునేలా కృషి చేస్తామన్నారు. పదో తరగతి మొదలుకొని ఉన్నత చదువులు చదివే విద్యార్థులు ప్రస్తుతం పరీక్షల సమయమన్న విషయాన్ని గుర్తు చేసుకుని వారి కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బాగా చదివి పరీక్షలు రావాలని తెలిపారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు గొడవలకు దిగకుండా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకునేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.



అసత్య ప్రచారాలు దుర్మార్గం

- డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమని డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు తెలిపారు. బుధవారం ఆయన గోనెగండ్ల మండల హెచ్.కైరవాడీ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్.కైరవాడి దళిత సర్పంచి సూర్యపోగు సువర్ణమ్మను కింద కూర్చోబెట్టి అవమానించారని రెండు రోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని తెలిపారు. హెచ్.కైరవాడి అరుణమ్మ, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక దళిత క్రైస్తవుల పట్ల ప్రేమానురాగాలు పంచుతున్నారని చెప్పారు. కర్నూలు రహదారికి ఆనుకొని ఉన్న రూ.కోట్ల విలువ చేసే భూమిని గ్రామంలో చర్చి నిర్మాణానికి దళితులకు ఇచ్చారిన తెలిపారు. ఒక దళిత మహిళను సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. అరుణమ్మ సొంత బిడ్డలా చూసుకుంటారని దళిత సర్పంచి సువర్ణమ్మను చెప్పారని అన్నారు. బుట్టా రేణుక ఎంపీగా ఉన్నప్పుడు దళితులకు ఎన్నో సహాయ, సహకారాలు అందించి, చర్చి నిర్మాణాలకు తోడ్పాటు కూడా అందించారని తెలిపారు. ఇటీవల కుర్ని కల్యాణ మండపంలో జరిగిన పాస్టర్ల సమావేశంలోనూ క్రైస్తవ మహిళల సంస్కృతి ఉట్టి పడేలా, దళిత క్రైస్తవ మహిళలను గౌరవించే విధంగా ఆమె నడుచుకున్నారని చెప్పారు. అరుణమ్మ ఇంట్లో సర్పంచి సువర్ణమ్మ, వివిధ కులాలకు చెందిన పెద్దలు, పూజారులు, అనేక మంది గ్రామ నాయకులు కిందనే కూర్చున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు.


సర్పంచి సువర్ణమ్మతో ఉన్న అరుణమ్మ, ఆల్ఫ్రెడ్ రాజు

ఘనంగా బాపురం శ్రీగంగాభవాని క్షేత్ర ముఖ ద్వారం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బాపురం గ్రామంలో వెలిసిన శ్రీగంగాదేవి క్షేత్ర ముఖ ద్వారం ప్రారంభోత్సవం పీఠాధిపతి శ్రీబసలింగమ్మ అవ్వ ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా జరిగింది. బాపురం శ్రీగంగాభవానిదేవీ ఆలయం నుంచి భారీ ఊరేగింపుగా మాధవరం రహదారిలోని చిన్నతుంళం గ్రామ క్రాస్ రోడ్డులో నిర్మించిన ముఖ ద్వారం వరకు వచ్చి పీఠాధిపతి శ్రీబసలింగమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ జెసిఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, మత్స్య శాఖ సహకార సంఘం జిల్లా వైస్ ఛైర్మన్ పెద్ద వీరేష్, వైసిపి నాయకులు నరవ రాజశేఖర్ రెడ్డి, చిన్న వీరేష్, బోయ కడబూరి, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తనయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టిడిపి గ్రామ నాయకులు వీరేష్ గౌడ్, నాయకులు శివ, చంద్ర, నరసింహులు, సిపిఎం నాయకులు తిక్కన్న, హనుమంతు పాల్గొన్నారు. ముఖద్వారం ప్రారంభోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


ప్రారంభిస్తున్న బసలింగమ్మ అవ్వ


రూ.30 లక్షలతో ముఖ ద్వారం నిర్మించిన దాత భరత్

శ్రీగంగాదేవి క్షేత్ర ముఖ ద్వారాన్ని చిన్నతుంళం క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటకలోని రాయచూరుకు చెందిన వ్యాపారి రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు.

వైభవంగా మారికాంబదేవి దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీమారికాంబదేవి గ్రామ దేవర ఉత్సవాలు కౌతాళంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ఇళ్ల నుంచి కుంభాలతో బయల్దేరి దేవాలయంలో పూజలు నిర్వహించారు. దేవర ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు గ్రామమంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఇంటికీ బంధుమిత్రులు రావడంతో పండగ వాతావరణం నెలకొంది.


దేవర ఉత్సవాల్లో పాల్గొన్న వైసిపి నాయకులు

మారికాంబ దేవి సన్నిధిలో ప్రముఖులు

వైసిపి యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, నాయకులు రాఘవేంద్ర రెడ్డి, అబ్దుల్ సమద్, వడ్డే రాముడు తదితరులు దేవాలయంలో పూజలు నిర్వహించారు. వీరిని గ్రామ నాయకులు సన్మానించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, కొట్రేష్ గౌడ్, టిప్పు సుల్తాన్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొని దేవాలయంలో పూజలు నిర్వహించారు. వీరికి గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు.



సిఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పి

నెరవేరని హామీలు..

- పరిష్కారం కాని సమస్యలు
- జగన్‌పైనే జిల్లా వాసుల ఆశలు
- నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేర లేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఆయనపైనే జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు...

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు వద్ద జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బనగానపల్లెలో ఇబిసి నేస్తం పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో జిల్లాకు సంబంధించి పలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఆ హామీలు నెరవేర లేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఆయనపైనే జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు.

గుండ్రేవుల ఏదీ..?

వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి గుండ్రేవుల ప్రాజెక్ట్‌ను నిర్మిస్తానని 2017 నవంబరు 27న జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నిధులను కేటాయించారు. ఆ తర్వాత ఎన్నికల్లో టిడిపి ఓడింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా గుండ్రేవుల ఊసే ఎత్తలేదు.

నీటిని మరిచారు

దశాబ్దాలుగా కోడుమూరు ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. వైసీపీ అధికారం చేపట్టి నెల రోజులకే గాజులదిన్నె నుంచి పైప్‌లైన్ ద్వారా కోడుమూరుకు తాగునీరు తెస్తామని, సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నిర్మిస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పట్టించుకోలేదు. ఎల్లెల్సీని ఆధునికీకరించి, ఆయకట్టుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆదోని, ఆలూరు ప్రాంత ప్రజాలకు హామీ ఇచ్చారు. ఆదోని పట్టణ జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒక్కటీ నెరవేరలేదు. ఆలూరు నియోజకవర్గంలో శాశ్వత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి వేదవతి ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. 15 ఏళ్లుగా శంకుస్థాపనకే పరిమితమైన నగరడోన రిజర్వాయర్ నిర్మించి చిప్పగిరి, ఆలూరు ప్రాంతాల్లో 4,200 ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏదీ నెరవేరలేదు. కెసి ఆయకట్టు స్థిరీకరణ కోసం సాగునీటి వనరులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు.

ఆగని వలసలు

వలసల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. దీంతో జిల్లాలో వలసలు ఆగడం లేదు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం జిల్లా నుంచి 2 లక్షల మంది వలస వెళ్తున్నారు.

హైకోర్టుకు పడని అడుగులు

కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటిస్తూ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడుస్తున్నా హైకోర్టు ఏర్పాటుకు అడుగులు పడటం లేదు. కర్నూలు నగర శివార్లలోని జగన్నాథగట్టు వద్ద హైకోర్టు కోసం 200 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అక్కడితో ఆ ప్రక్రియ ఆగిపోయింది. ప్రతిపక్షాలు హైకోర్టు ఏర్పాటుకు అడ్డుపడుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏదీ?

జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ భూమిపూజకే పరిమితమైంది. ప్రాసెసింగ్ యూనిట్ వస్తే కాస్త ధర దక్కుతుందన్న రైతన్నకు నిరాశే ఎదురవుతోంది. చిత్తూరు జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమోటాను అత్యధికంగా క్రయవిక్రయాలు సాగుతాయి. పత్తికొండ నుంచి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. టమోట ఎక్కువగా సాగు ఉండటంతో ఆ ప్రాంతంలో టమోటా జ్యూస్, సాస్ తయారు చేసేలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్.జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకా మూడేళ్లు దాన్ని పట్టించుకోలేదు. జూన్1న ముఖ్యమంత్రి పత్తికొండలో పర్యటించిన సందర్భంగా పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని మళ్లీ ప్రకటించారు. సెప్టెంబర్‌లో పత్తికొండ శివార్లలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రాంతంలో అధికారులు భూమిపూజ కూడా చేశారు. యూనిట్ నెలకొల్పేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అక్కడి నుంచి ముందుకు కదలలేదు.

నేడు ముఖ్యమంత్రి పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్‌పి
- ప్రారంభానికి సిద్ధంగా వంద పడకల వైద్యశాల
- ఈబిసి నేస్తం పథకాన్ని ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి - బనగానపల్లె

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బనగానపల్లెలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను, హెలిప్యాడ్ ప్రాంతాన్ని, బహిరంగ సభ ఏర్పాట్లను వైసిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నేత కాటసాని ఓబుల్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. 22 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆసుపత్రి భవనాన్ని, ఈ బీసీ నేస్తం పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేడు ఉదయం 11 గంటల 15 నిమిషాలకు ఓర్వకల్ నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హెలిక్యాప్టర్ ద్వారా బనగానపల్లెకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి పలు అభివృద్ధి పనులు ప్రారంభించి 11:25 నిమిషాలకు పబ్లిక్ మీటింగ్ వద్దకు చేరుకుంటారని చెప్పారు. 1:15 నిమిషాలకు సభా ప్రాంగణం నుంచి బయలుదేరి అనంతరం 1:20కి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని 2:20 నిమిషాల వరకు పబ్లిక్ లోకల్ లీడర్స్‌తో మాటామంతి కార్యక్రమం, అనంతరం 2:25 నిమిషాలకు బనగానపల్లె నుంచి బయలుదేరుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైయస్సార్, కాటసాని అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి పోచ శీలారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాష్ రెడ్డి, యాగంటి దేవస్థానం పాలకమండలి చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, నాయకులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, అంబటి రవికుమార్ రెడ్డి, జిలెళ్ల శంకర్ రెడ్డి, పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, కొత్తపేట సుబ్బారెడ్డి, మీరాపురం మనోహర్ రెడ్డి, కైప ప్రతాప్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం పర్యటన నేపథ్యంలో

సిఐటియు నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బనగానపల్లెకు వస్తున్న సందర్భంగా నంద్యాలలో ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సిఎం పర్యటనకు ఆటంకం కలిగించకుండా ఆందోళనలు చేయకూడదని, బనగానపల్లెకు వెళ్తున్నారనే అనుమానంతో ముందస్తుగా అరెస్టు చేస్తున్నట్లు సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, పట్టణ కోశాధికారి వెంకట లింగంలకు టూటౌన్ సిఐ రాజారెడ్డి నోటీసులు అందజేశారు. ముందస్తు అరెస్టులను సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఎక్కడో కార్యక్రమాలు జరిగితే నంద్యాలలో నాయకులను అరెస్టు చేయడమేమిటని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, నాగరాజులు ప్రశ్నించారు.



సిఐటియు నాయకులకు నోటీసులు ఇస్తున్న సిఐ రాజారెడ్డి

శ్రీశైలంలో ఏప్రిల్ 6 నుండి ఉగాది ఉత్సవాలు

- దేవస్థానం ఇఒ పెద్దిరాజు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో ఏప్రిల్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ ఉగాది ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయని ఇఒ పెద్దిరాజు తెలిపారు. బుధవారం శ్రీశైలంలోని పరిపాలన భవనంలో సెక్షన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది మహోత్సవాలలో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైల క్షేత్రాన్ని సందర్శిస్తారని, వారం రోజులు ముందుగానే క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారుర. ఈ నెల 29 నాటికి ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలన్నారు. ఇందులో ముఖ్యంగా స్వామి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కాలినడకన వచ్చే భక్తులకు వెంకటాపురం, నాగలూటి, పెద్ద చెరువు, దామర్లకుంట, మఠంబావి, భీమునికొలను, కైలాస ద్వారం, హటకేశ్వరం, సాక్షి గణపతి తదితర ప్రాంతాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. భీముని కొలను, కైలాస ద్వారం నుండి పైపుల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. మార్గమధ్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసే స్వచ్ఛంద సేవ సంస్థలకు దేవస్థానం నుండి తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. మహాశివరాత్రికి బయలు ప్రాంతాలలో ఏర్పాటు విధంగానే షామియానాలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్ర పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి శుభ్రం చేయాలన్నారు. భక్తులకు అర్థమయ్యేలా సూచిక బోర్డులు, భక్తులను అలరించేందుకు సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు సమాచారం అందించేందుకు ప్రధాన కూడలి వద్ద సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ పెద్దిరాజు

శ్రీశైలంలో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి శ్రీశైలం

శ్రీశైల క్షేత్ర పరిధిలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ ప్రసాద్ రావు బుధవారం తెలిపారు. సిఐ మాట్లాడుతూ స్థానికంగా నాటు సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించగా బాలరాజు, శివల వద్ద 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ఇద్దరు మహిళలు చైన్ స్నాచింగ్‌కు పాల్పడగా అరెస్టు చేశామన్నారు. ఈ నెల 10న రథోత్సవ సమయంలో శ్రీశైలానికి చెందిన కురువ కృష్ణమ్మ మెడలో నుండి రూ.2 లక్షల 40 వేలు విలువ చేసే బంగారు తాళిబొట్టు గొలుసు దొంగలించారని బాధితురాలు ఫిర్యాదు మేరకు తనిఖీలు చేస్తుండగా ముఖద్వారం వద్ద హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ, నెల్లూరుకు చెందిన మరియమ్మలను అదుపులోకి తీసుకొని, బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో ఐఎఫ్‌టియు, ఎవైఎఫ్ శ్రమదానం

- చెత్తాచెదారం శుభ్రం చేసిన నాయకులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

సుండిపెంట గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునే చోట చెత్తా చెదారంతో దుర్వాసన వస్తుండటంతో ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, ఏవైఎఫ్ మండల టి.మల్లికార్జున కార్మిక బృందంతో కలిసి బుధవారం శ్రమదానం చేసి శుభ్రం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్టాండ్లో ప్రయాణికుల వేచి వుండే చోట భారీగా చెత్త పేరుకుపోవటమే కాకుండా తాగుబోతులకు అడ్డా మారిందన్నారు. మహిళలు కూర్చోలేని పరిస్థితి ఉందన్నారు. కనీస ఫ్యాన్ల సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. ఈ బస్టాండ్‌కు ఎపి నుండే కాకుండా కర్ణాటక నుండి రోజుకు వందల బస్సులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వస్తుంటాయని చెప్పారు. ఆర్టీసీ అధికారులు, గ్రామపంచాయతీ వారు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ పారిశుధ్యం బాధ్యతపై పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే సుండిపెంట ఆర్టీసీ బస్టాండును పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.రాజు, యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్టాండ్‌లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న ఐఎఫ్‌టియు, ఎవైఎఫ్ నాయకులు

సిఎఎతో ప్రజల ఐక్యతకు విఘాతం

- తక్షణం సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

సిఎఎతో ప్రజల ఐక్యతకు విఘాతం కలుగుతుందని, తక్షణమే సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నాయకులు పి.పకీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ సభన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని ముందుకు తీసుకువచ్చి ప్రజల ఐక్యతకు విఘాతం కలిగించే చర్యలకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశంలో ప్రజలను మతాల పేరుతో చీలిక చేసి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సిఎఎ అనేది ముస్లింల సమస్య ఒక్కటే కాదని, ఇది దేశ రాజ్యాంగ సమస్య అన్నారు. నేడు ముస్లింలను లక్ష్యంగా పెట్టుకొని బిజెపి రేపు క్రైస్తవులు, దళితులు, గిరిజనులపై కూడా సిఎఎ పేరుతో దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. సిఎఎ చట్టం చేసినప్పుడే దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. ప్రజల ఆందోళనకు నాడు వెనక్కి తగ్గిన బిజెపి ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని అమలుకు పూనుకుంటుందని అన్నారు. ఈ ప్రమాదకరమైన సిఎఎపై రాష్ట్రంలోని టిడిపి, వైసిపి తమ వైఖరులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కె.భాస్కర్ రెడ్డి, నాయకులు ఎం.కర్ణ, చందమాల నాగన్న, డక్క కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వైసిపి నుండి టిడిపిలో చేరిన వారి

కష్టసుఖాల్లో అండగా ఉంటా : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి నుండి టిడిపిలో చేరిన వారి కష్టసుఖాల్లో అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఐవి పక్కిరా రెడ్డి ఆధ్వర్యంలో అవుకు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన యనమల నారప రెడ్డి, కుంచెపు రామచంద్రుడు, మక్కల రమణ, షైక్ షావలి, చాంద్ బాషా, హుస్సేన్ బాషా, డ్రైవర్ బాషా, పండిపోటి రమణ, మక్కల శ్రీరాములు, మంజుల వెంకట రమణ, మక్కల వెంకటేశ్వర్లు, డెరంగుల నాగేష్, నర్సీపల్లి రామయ్య, కొండప్ప తదితర 80 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే, బనగానపల్లె టిడిపి అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటసాని అండదండలతో చెర్లోపల్లి గ్రామంలో రాకాసి మూకలు విజృంభిస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగాలు లేక, పరిశ్రమలు రాక యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 35 రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని, టిడిపికి అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి మాయ మాటలు నమ్మి కాటసానిని గెలిపించామని, ఈ సారి తప్పకుండా బీసీ జనార్దన్ రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఐవి పక్కిరా రెడ్డి, ఎస్‌వి శివరామి రెడ్డి, కె బాల నాగిరెడ్డి, గౌరు రామిరెడ్డి, కాత్రేడ్డి మల్లిఖార్జున రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపి నాయకులకు టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

బిసి డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

బిసి డిక్లరేషన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి, నంద్యాల టిడిపి అభ్యర్థి ఎంఎండి ఫరూక్ పార్టీ నాయకులకు సూచించారు. బుధవారం నంద్యాల మండలం అయ్యాలూరు గ్రామంలో టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించి శంఖారావం కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు, శంఖారావం కిట్ల పంపిణీ ఎలా జరుగుతుందని నాయకులను అడిగి తెలుసుకున్నారు. టిడిపి గెలుపునకు గ్రామంలో మెజారిటీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అయ్యాలూరు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరుక్

విద్యుత్ కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్న కంబలూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో రూ.18 లక్షలతో కొత్తగా కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు చేశారు. బుధవారం కెపాసిటర్ బ్యాంక్‌ను విద్యుత్ ఏడి రవికాంత చౌదరి, ఏఈ రాఘవేంద్ర రెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొత్తగా కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు చేయడం వలన చిన్న కంబలూరు పరిధిలో ఉన్న రైతులందరికీ లో వోల్టేజీ సమస్య ఉండదని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలవుతుందన్నారు. రైతులు విద్యుత్ అధికారులకు సహకరించి సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన విద్యుత్ కెపాసిటర్ బ్యాంకును ప్రారంభిస్తున్న విద్యుత్ అధికారులు

తల్లీబిడ్డ మృతి

- విషం తాగి పాలు ఇవ్వడంతో ఘటన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో మానసిక పరిస్థితి బాగోలేని హిందుమతి(26) విషం (కల్లాపి పౌడర్) తాగి బిడ్డకు పాలు ఇవ్వడంతో ఇద్దరూ మృతి చెందిన ఘటన బుధవరాం చోటు చేసుకుంది. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన హిందుమతి మానసిక పరిస్థితి బాగాలేకపోవంతో కల్లాపి చల్లే పౌడర్ నీళ్లలో వేసుకుని తాగింది. కొద్దిసేపటికే తన బిడ్డ ఏడుస్తోందని హిందుమతి పాలు ఇచ్చింది. కొద్దిసేపటికే తల్లీబిడ్డ ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుం సభ్యులు, స్థానికులు వెంటనే వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలరు. వైద్యులు పరీక్షించి అప్పటికే తల్లీబిడ్డ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమ్మాయిలను గౌరవించాలి

- ప్రముఖ సినీ నటుడు మంచు మనోజ్

ప్రజాశక్తి - నంద్యాల : ప్రస్తుత సమాజంలో అబ్బాయిలు వారి ఇండ్లలో, చుట్టుపక్కల ఉన్న ప్రతి అమ్మాయిని గౌరవిస్తూ, వారిలో ధైర్యాన్ని ఇవ్వాలని ప్రముఖ సినీ నటుడు మంచు మనోజ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నటుడు మంచు మనోజ్ హాజరై మాట్లాడారు. అమ్మాయిలు ఆదిపరాశక్తులని, వారు తలుచుకుంటే ఏదైనా చేయగలరని అన్నారు. ఇప్పుడు ఎవరి సహాయం అవసరం లేకుండా 'మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి మొబైల్స్‌లో ఎన్నో ఆప్స్ ఉన్నాయి. మీరు వాటిని తెలుసుకోవాలి' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జి.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి, ఎస్టేట్ మేనేజర్ ప్రగతి రెడ్డి, ఐసిడిఎస్ అధికారులు జి.నాగ సువర్చల, డాక్టర్ ప్రసన్న లత, టిఆర్ ఎం.చంద్రకళ, తిరుపతి రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ నటుడు మంచు మనోజ్

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సిఐ ప్రకాష్ కుమార్ తెలిపారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరులో బిఎస్‌ఎఫ్ దళాలు కవాతు నిర్వహించారు. అనంతరం పట్టణ సీఐ ప్రకాష్ కుమార్, ఎస్సై నాగార్జున చట్టాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఎస్‌ఎఫ్ ఎస్ఐ మోహన్ రామ్, సిబ్బంది, పాల్గొన్నారు.


బాధిత రైతుకు లక్ష రూపాయలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

బాధిత రైతుకు మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని కైప గ్రామానికి చెందిన బాధిత రైతు తెలుగు మధుకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి రూ. లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. తెలుగు మధుకు చెందిన 250 ట్రిప్పుల జొన్న సొప్ప మంగళవారం పూర్తిగా కాలిపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. నష్టపోయిన రైతుకు లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రఘునాథ్ రెడ్డి, అక్బర్ బాషా, తెలుగు గోపాల్, బోయ నాగేంద్ర, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : విధి నిర్వహణలో ఉన్న సిటీ కేబుల్ వీడియో జర్నలిస్ట్ హరీష్‌పై దురుసుగా ప్రవర్తించిన శిరివెళ్ల తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షులు మాదాల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శివ, జగన్ మోహన్‌లు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిరివెళ్లకు చెందిన మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందగా వీధి నిర్వహణలో భాగంగా వీడియో తీస్తుండగా అక్కడికి చేరుకున్న తహసీల్దార్ వీడియో జర్నలిస్ట్‌పై చిందులేస్తు సెల్‌ఫోన్ లాక్కొని వీడియోలను డిలీట్ చేయడాన్ని అక్షేపించారు. జర్నలిస్ట్ హరీష్ విధులకు ఆటంకం కలిగించి, దురుసుగా ప్రవర్తించి, సెల్ ఫోన్ లాక్కున్న తహసీల్దార్‌పైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

చౌడేశ్వరి అన్నదాన సత్రానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి నిత్యాన్నదాన సత్రానికి భక్తులు రూ.50 వేలు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. బుధవారం బనగానపల్లె పట్టణానికి చెందిన కంపమల్ల .పెద్ద సుబ్బారెడ్డి భార్య వెంకటమ్మల జ్ఞాపకార్థం వారి ముని మనుమరాలు శ్రీ దాత్రి ఆలయ అర్చకులకు విరాళం రూ. 50 వేలు చెక్కును అందజేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి పాలన సాగిస్తుందని జడ్పిటిసి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, సచివాలయ కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చంద్రపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మతో కలిసి వారు నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాయి మనోహర్, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి కిరణ్, పెద్దబాయి సర్పంచి రామచంద్రారెడ్డి, నాగిరెడ్డి శివశంకర్, యాగంటి, కేకే రెడ్డి, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న జడ్పిటిసి శ్రీరామారెడ్డి, సర్పంచి సరోజమ్మ

మహిళల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్మన్
- వైఎస్ఆర్ చేయూత చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహిళల అభ్యున్నతే జగనన్న లక్ష్యమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, మార్కెట్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాలు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో క్రాంతి పథకం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గంలోని అర్హులైన మహిళలకు వైఎస్ఆర్ చేయూత చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 8,390 మంది లబ్ధిదారులకు రూ.1573.13లక్షలు, నంద్యాల మండల పరిధిలో 3,660 మంది లబ్ధిదారులకు రూ.686.25 లక్షలు, గోస్పాడు మండల పరిధిలోని 2,258 మంది లబ్ధిదారులకు రూ.423.328 లక్షలు మంజూరయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి,రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృత రాజ్, ఏపీఎస్ పీడీసీల్ డైరెక్టర్ శశికలరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల జిల్లా మహిళ అధ్యక్షురాలు శకుంతలమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మహిళల అభివృద్ధే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. చాగలమర్రి మండలంలోని 2831 మంది మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం కింద మంజూరయిన 5 కోట్ల 35 లక్షల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ తులసమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల అధ్యక్షుడు వీరభద్రుడు, జిల్లా జెసిఎస్ కన్వీనర్ షేక్ బాబులాల్, మండల కన్వీనర్ వైయస్సార్ కాంగ్రెస్ ఆర్థిక సంస్థ డైరెక్టర్ శ్రీ బాలవిద్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్టు జిల్లా అధికారి దానం, ఇన్చార్జి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, చాగలమర్రి ఉపసర్పంచ్ షేక్ సోహెల్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, మండల కో ఆప్షన్ సభ్యులు జగ్గి గారి ఇబ్రహీం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జబీర్, తోడేండ్లపల్లి సర్పంచ్ గోవిందయ్య, శెట్టివీడు సర్పంచ్ లక్ష్మీదేవి, వైసిపి నాయకులు ముల్లా ఖాదర్ భాష ఒలిసా గారి షరీఫ్, పెద్ద రాముడు యాదవ్, గొట్లూరు శివారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ప్రజాసంక్షేమం, గ్రామ స్వరాజ్య పాలన వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి రెడ్డి అన్నారు. రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో రామచంద్ర, వెలుగు ఏపిఎం కల్పలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ చేయూత పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పుష్కలంగా సాగునీరు అందుతుందని, ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో గొడవలు సృష్టించి ఫ్యాక్షన్ ముసుగులో ప్రశాంతతను భగ్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రానున్న ఎన్నికలలో మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జలవనుల ప్రభుత్వ సహాయ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు, పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, పుట్టాలమ్మ క్షేత్రం కమిటీ సభ్యుడు గంగిశెట్టి తిమ్మయ్య శెట్టి, జడ్పిటిసి మాధవి, ఎంపీపీ మబ్బు బాలస్వామి, గ్రామ సర్పంచ్ బైరి విజయలక్ష్మి, మండల నాయకుడు ప్రసాద్ రెడ్డి, కన్వీనర్ పాణ్యం నాగేష్, దేవగుడి జాకీర్ హుస్సేన్, కొల్లం పుల్లయ్య, బైరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


నంద్యాలలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్మన్


చాగలమర్రి : చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల నాని


రుద్రవరం : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం : అఖిలప్రియ

- వైసిపి సీనియర్ నాయకులు టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

టిడిపి అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ అభ్యర్థి భూమ అఖిల ప్రియ పేర్కొన్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో పట్టణంలోని6వ వార్డుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు యాపర్ల బాలీశ్వర రెడ్డితోపాటు ఆయన అనుచర 20 కుటుంబాలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులు నేరుగా బాలీశ్వర రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అఖిల ప్రియ మాట్లాడుతూ తమ నాయకత్వం, టిడిపి విధివిధానాలు నచ్చి బాలీశ్వర రెడ్డి వైసీపీని వీడి టిడిపిలోకి చేరారన్నారు. గంగుల కుటుంబానికి ఆయన ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందించారని, కానీ ఆయన సేవలను వారు గుర్తించలేకపోయారన్నారు. బాలీశ్వర రెడ్డి కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి బంగారు రాము యాదవ్, కూడాల నారాయణరెడ్డి, ఆళ్ల నాగ శ్రీనివాసులు, మాధవ రెడ్డి, గుండా మని, గాలి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో చేరిన బాలీశ్వర రెడ్డి

సిఎం జగన్‌ను సాగనంపాలి : గౌరు వెంకట్ రెడ్డి

గడివేముల : పరదాల చాటున పాలన చేస్తున్న సిఎం జగన్ మోహన్ రెడ్డిని ఈ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపించాలని టిడిపి నేత గౌరు వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గడిగరేవుల గ్రామంలో వైసీపీ నుండి టిడిపిలోకి సర్పంచ్ సోదరుడు బిఎస్ రాంభూపాల్ రెడ్డి, వార్డు మెంబర్ ప్రసాద్‌తో పాటు 20 కుటుంబాలు చేరాయి. వారికి గౌరు వెంకట్ రెడ్డి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూల్చివేతతో మొదలైన జగన్ పాలన యువతకు నిరుద్యోగులుగానే ఐదు సంవత్సరాలు మిగిల్చారని, ఇసుక, మద్యం మాఫియాతో వైసీపీ నాయకుల జీవితాలు మెరుగుపడ్డాయని ఎద్దేవా చేశారు. పాణ్యం టిడిపి అభ్యర్థి గౌరు చరితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించు కోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, దుర్గా భోగేశ్వరం మాజీ చైర్మన్ శ్రీనివాసులు, గిరిబాబు, సుదర్శన్ రెడ్డి, వంటరామ్ మద్దిలేటి రెడ్డి, పంట దిలీప్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


గడివేముల : టిడిపి కండువాలు కప్పుతున్న గౌరు వెంకట్ రెడ్డి

కనీస మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ కనీస మద్దతు ధరతో రైతుల నుండి జొన్నలను (మహీంద్రా రకం) క్వింటాలు ధర 3,180 రూపాయలతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేంద్ర వెరైటీ సి-43 జొన్నలను ఈ క్రాప్, ఈకెవైసి చేయించుకున్న రైతుల నుండి కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని రైతులు ఎవరయితే పౌర సరఫరాల శాఖకు ఇప్పటి వరకు జొన్నలు అమ్మకాలు చేయలేదో వారు మాత్రమే అర్హులన్నారు. గరిష్టంగా ఒక రైతుకు 5 ఎకరాల పరిమితిని విధించామని,అవసరమైన గోనెసంచులను, రవాణా సౌకర్యం మార్క్‌ఫెడ్ వారే కల్పిస్తారన్నారు. జొన్నలను జల్లి పట్టి గోనెసంచులలో నింపి, లారీలో లోడ్ చేసే వరకు అయ్యే హమాలీ ఖర్చు మాత్రమే రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. జొన్నల కొనుగోలు సమయంలో బయో మెట్రిక్ వేయుటకు రైతు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. రైతులు ఆర్‌బికెలలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయంలో భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : నంద్యాల పట్టణం పరిధిలోని వెంకటేశ్వరపురం గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కీర్తిశేషులు బొమ్మన రామసుబ్బారెడ్డి, ధర్మపత్ని సుశీలమ్మల జ్ఞాపకార్థం బొమ్మల తిరుపతి రెడ్డి, లక్ష్మి దేవమ్మలు కట్టించిన భోజనశాలను బుధవారం నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ భోజనాశాలను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. టౌన్‌లలో , గ్రామాలలో దేవాలయాలు, మసీదులు, చర్చిలు అభివృద్ధి చేయాలని, రేపు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వాటి అభివృద్ధిలో తమవంతు పాత్ర ఉంటుందని తెలియజేశారు.


మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

పంటలను కాపాడుకునేందుకు భగీరథ యత్నం

- ఎండిన బోర్లు - మోటార్లతో కాల్వల్లోని మురుగు నీరు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారిలో రైతు బాలకృష్ణ సాగు చేసిన సజ్జ పంటను కాపాడుకోవడానికి గ్రామం నుంచి వచ్చే మురుగు నీటితో సోమవారం పొలాన్ని తడిపారు. పొలంలో ఉన్న బోరు ఎండి పోవడంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు మురికి కాలువకు విద్యుత్ మోటర్ ఏర్పాటు చేసి పైపుల ద్వారా నీటిని పారించి పంటను కాపాడుకుంటున్నారు. బోర్లు అడుగంటి పోవడం వల్ల నీటి సమస్య తలెత్తిందని,మురుగు నీటి కోసం చాలా ఖర్చు చేయాల్సి వచ్చిందని రైతు వాపోయారు. అలాగే అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో రియాజ్ అనే మరో రైతు మురుగు నీటితో మొక్కజొన్న పంటను తడుపుకుంటున్నారు. బోర్లలో నీరు లేక పోవడం వల్లే ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


సజ్జ పంటకు మురుగు నీరు కడుతున్న రైతు



డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రక్తదానం

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని చందమామ హాస్పిటల్‌లో జన్మించిన శిశువుకు డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ బుధవారం రక్తదానం చేశారు. ఓ నెగటివ్ బ్లడ్ అర్జెంటుగా కావాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివకు తెలియజేయడంతో వెంటనే స్పందించి రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ రక్తదానం చేయడం ఇది 11వ సారి అన్నారు. ఇప్పుడున్న యువత బ్లడ్ డొనేషన్ చేయడంలో ముందుండాలని తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ జవహర్ బాబు తెలిపారు. బుధవారం కొత్తపల్లిలోనిఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో రేష్మ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది మార్చి నెల పనిదినాల టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 పని దినాలు పూర్తి చేయించాలన్నారు. గ్రామాలలో రిజిష్టర్ నిర్వహణ ప్రతి పనికి నిర్వహించాలని, హాజరు, కొలతలు ఫీల్డ్‌లో ఉన్న మేరకు తీసుకోవాలని చెప్పారు. జాబ్ కార్డ్‌లో చనిపోయిన వారి పేర్లు, మైగ్రేట్ అయిన వారి పేర్లు తొలగించాలని, ప్రతి కుటుంబం కూడా జాబ్ కార్డ్ ఉండేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ రాజు నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్మకూర్ : ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ప్రతి వార్డులోనూ సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయ్ చౌదరి. మారుబోతుల విజయ. పాన్ భాష. జెడ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టండి : మాజీ మంత్రి


సూపర్-6 పథకాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ మంత్రి

ప్రజాశక్తి - చాగలమర్రి

పరిపాలన చేతగాని జగన్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టాలని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం చాగలమర్రిలోని 210, 211 బూతులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ వైసిపి నాయకులను ఇళ్లల్లో కూర్చోబెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాషా, కొలిమి హుస్సేన్ వల్లి , కొలిమి మాబు షరీఫ్, మౌలాలి, క్లస్టర్ ఇంచార్జ్ అజీమ్, ముల్లా గఫార్, నూర్ బాషా, జెట్టి నాగరాజు, మద్దూరు మాబులాల్, ఎన్ఎండి రఫీద్దీన్, టైలర్ ఖాదర్, అజీమ్, రియాజ్, కరిముల్లా, హనీఫ్, రాజేష్, నరసింహ, వెంకటయ్య, ఖలీల్, నాగూర్, కాజా రసూల్, గుత్తి నరసింహులు, బషీర్, రాజేష్, ముల్లా రఫీ, కొలిమి షబ్బీర్, కొలిమి అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఆళ్లగడ యువనాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి నిర్వహించారు. ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను అందజేశారు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, ఇండ్ల లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మం, ఐ టిడిపి ఉపాధ్యక్షురాలు శజ్జ రెడ్డి, సయ్యద్ షరీఫ్, సయ్యద్ రసూల్, సాయి రెడ్డి సుబ్రహ్మణ్యం, డిఎం భాష, బాలుడు, హరిచంద్రారెడ్డి, ఓబయ్య, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు టిడిపిని ఆదరించాలి : కోట్ల నివేదిత రెడ్డి

డోన్ : వచ్చే ఎన్నికలలో ప్రజలు టిడిపికి ఓటు వేసి ఆదరించాలని డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత రెడ్డి కోరారు. బుధవారం డోన్ పట్టణంలోని 21, 22వ వార్డులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులలో ఇంటింటికి తిరుగుతూ టిడిపి మేనిఫెస్టోను వివరించారు. డోన్ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పణిరాజ్, ఓబులాపురం శేషిరెడ్డి, ఓం ప్రకాష్, రజని, ఎరుకల చెరువు శివ, భాష్యం శ్రీధర్ గౌడ్, దిలీప్ రెడ్డి, కెఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : రైతుల సమస్యలను వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి బిసి జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటలో మాజీ ఎమ్మెల్యే బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తూ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వస్తే యువగళం పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 20 లక్షల నిరుద్యోగులకు ఉపాధి, ప్రతి నిరుద్యోగికి 'యువగళం నిధి' కింద నెలకు 3000 రూపాయలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర రెడ్డి, టిడిపి నాయకులు బివి ప్రసాద్ రెడ్డి, అమడాల మద్దిలేటి, గువ్వల సుబ్బారెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, మురళి, రాజశేఖర్, జనసేన నాయకులు గుర్రప్ప, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డోన్ : ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న కోట్ల నివేదిత రెడ్డి

వ్యవసాయం లాభసాటిగా మారాలి : గౌరు వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి - పాణ్యం

రైతులు చేసే వ్యవసాయం లాభసాటిగా వుండాలని టిడిపి నాయకులు గౌరు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పాణ్యం మండలం కొనిదేడు గ్రామ సమీపాన సుమారు 5 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన రైస్ మిల్‌ను టిడిపి నాయకులు గౌరు వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరికొత్త టెక్నాలజీతో నిర్మించిన ఈ మిల్ రైతులకు చాల ఉపయోగకరంగా వుంటుందని అన్నారు. రైతులు పంట కోతకు వచ్చిన తరువాత ధాన్యం ఆరబోసి వాటిని సంచులలో నింపి తరువాత మిల్‌కు తరలించి ఇవన్నీ వ్యయ ప్రయాసలకు గురికాకుండా పంటను నేరుగా ట్రాక్టర్‌లలో మిల్‌కు తరలించి బియ్యంగా మార్చుకోవచ్చని నిర్వాహకులు రాం పుల్లారెడ్డి అన్నారు. రైతులకు ఉపయోగ కరమైన ఇలాంటి మిల్ టెక్నాలజీ తెచ్చినందుకు విజయానికేతన్ డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, సునిష్ కుమార్ రెడ్డిలను అందరు అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న గౌరు వెంకట్ రెడ్డి

చదువే విద్యార్థి జీవితానికి వెలుగు

ప్రజాశక్తి - ఆత్మకూర్ : పదవ తరగతి విద్యార్థులు ఒఐషి, పట్టుదల, క్రమశిక్షణతో ఇష్టపడి చదవి మంచి మార్కులు సాధించి భావి భారత పౌరులుగా ఎదగాలని, చదువే విద్యార్థి జీవితానికి వెలుగని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్ అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని సమీకృత గిరిజన హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భయపడకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు, ఉపాధ్యాయులు క్రిష్ణయ్య, కష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జవహర్ నాయక్

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి - బనగానపల్లె : కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న ఆమె విగ్రహానికి కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరి సురేష్ బాబు మాట్లాడుతూ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం విజ్ఞప్తి మేరకు ఎపిలో మొల్లమాంబ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించేలా జీవో ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా కలెక్టర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసుల్లో అధికారులు మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, లక్ష్మీదేవి, మణి, సంఘం గౌరవాధ్యక్షులు బ్యాంక్ మేనేజర్ బాబాయ్య, ప్రధాన కార్యదర్శి శివరామ్, గౌరవ సలహాదారులు, ఉప కోశాధికారి నాగరాజు, నాయకులు మహేష్, సుబ్బయ్య, శంకర్, లక్ష్మన్న, గుండ్ల శింగవరం శివయ్య, హరి, శివరామకృష్ణ, రామసుబ్బయ్య, బిజ్జన్న, నాగేంద్ర, తిమ్మయ్య, మద్దిలేటి, సాయి, శివన్న, నాగమయ్య, ఈశ్వరయ్య, మద్దిలేటి, గొందిన్నె రవి, రామసుబ్బన్న, శివయ్య, ధర్మేంద్ర, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో

మరణాలపై సమగ్ర విచారణ చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో జరిగే మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వై భార్గవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సిపిఐ మండల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన గర్భిణి పురిటి నొప్పులు రావడంతో ప్రసవం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు సోమవారం రాత్రి వెళ్లారని, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం ఉదయం డాక్టర్ వచ్చేంతవరకు వేచి చూడాల్సి వచ్చిందని, డాక్టర్ వచ్చిన తర్వాత నిర్లక్ష్యం వహించి సకాలంలో వైద్యం అందించక, శిశువుకి ఆక్సిజన్ అందకపోవడంతో తొలి కాన్పులోనే శిశువు మృతి చెందినట్లు బాధిత మహిళ కన్నీటి పర్యంతమై రోధించిందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి శిశు మరణాలకు కారణమైన వారిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, ఎల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.